క్లుప్తంగా

ఆలయానికి టీవీ వితరణ



టీవీ అందిస్తున్న దాతలు

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి ఆలయం ఉన్న అన్నదాన సేవా ట్రస్ట్‌లో భక్తికి సంబంధించిన ప్రచారం నిమిత్తం రూ.30 వేలు విలువ చేసే టీవీని వితరణ చేశారు. చలివెందలకు చెందిన పారిశ్రామిక వేత్త హరికిషోర్‌రెడ్డి కొండూరు బ్రహ్మానందరెడ్డి ద్వారా కమిటీ సభ్యులకు బుధవారం టీవీ అందజేశారు. అదేవిధంగా అన్నదాన నిర్వహణ కోసం చెన్నైకి చెందిన డాక్టర్ జి.లక్ష్మి రూ.5 వేలు, నంద్యాలకు చెందిన డాక్టర్ వసంత మాధవ్ రూ. వెయ్యి కమిటీ సభ్యులకు అందజేశారు.

స్థలాన్ని కాపాడాలని వినతి

లేపాక్షి: మండలంలోని పులమతి పంచాయతీ పరిధిలోని ఏకలవ్య కాలనీలో తమకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిస్థలాలను కాపాడాలని తహసీల్దార్ బాలనరసింహులకు బుధవారం ఎరుకుల హక్కుల పోరాటా సమితి నాయకులు వినతిపత్రం సమర్పించారు. 2001లో ఎస్టీలకు సర్వేనెంబర్ 19–6బీలో ప్రభుత్వం పట్టాలిచ్చిందన్నారు. అయితే తాజాగా ఓ వ్యక్తి ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని చెప్పారు. తహసీల్దార్ స్పందిస్తూ రెవెన్యూ రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

టైలర్ కుమార్తెకు డాక్టరేట్



స్నాతకోత్సవంలో పట్టా అందుకుంటున్న యాస్మిన్

పావగడ: పట్టణంలోని న్యూ వెల్ కమ్ టైలర్ డీటీ రసూల్, హుసేన్ బీ దంపతుల కుమార్తె యాస్మిన్ డాక్టరేట్ పట్టా అందుకుంది. రాయచూరులోని యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ప్రాసెసింగ్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్ విభాగంలో 'ఎఫెక్ట్ ఆఫ్ ఎన్జిమాటిక్ ప్రిట్రీట్‌మెంట్ ఆన్ దాల్ రికవరీ అండ్ కుకింగ్ క్వాలిటీ ఆఫ్ టీఎస్– బీఆర్ అండ్ జీఆర్జీ–811 పిజియోన్పీ వెరైటీస్' అనే అంశంపై డా ఉదయ్‌కుమార్ నిడోని పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఇందులో భాగంగానే బుధవారం జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో గవర్నర్ తవర్ చంద్ గెహ్లాట్ చేతుల మీదుగా ఆమె పట్టా అందుకుంది. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ హనుమంతప్ప తదితర ప్రముఖులు పాల్గొన్నారు. యాస్మిన్ డాక్టరేట్ పట్టా అందుకోవడంతో తల్లితండ్రులు, కౌన్సిలర్ బాలసుబ్రహ్మణ్యం, పట్టణ వాసులు హర్షం తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

పెనుకొండ: భూమి రిజిస్ట్రేషన్ విషయంలో తమకు న్యాయం చేయాలని మండలంలోని కురుబవాండ్లపల్లికి చెందిన రాజశేఖర్, ఆయన భార్య ఆదిలక్ష్మి బుధవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులకు విన్నవించారు. 344–1 సర్వేనంబర్‌లో అన్నదమ్ములైన చిన్న వరదయ్య, పెద్ద వరదయ్యలకు 5 ఎకరాల భూమి ఉందని, అసైన్డ్ ఉన్న భూమి రిజిస్ట్రేషన్ పరిధిలోకి రావడంతో చిన్న వరదయ్య తమ సంతతికి చెందిన నాగార్జున, రామలక్ష్మి పేరిట రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అందులో తమకు భాగముందని, రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. అధికారులు నల్లప్ప, శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చిన్న వరదయ్య పేరుమీద రికార్డులు ఉండటం వల్లే ఆయన సూచించిన విధంగా రిజిస్ట్రేషన్ చేశామన్నారు. అయితే రాజశేఖర్, ఆయన భార్య అధికారులపై దురుసుగా మాట్లాడటంతో ఎస్‌ఐ రాజేష్ అక్కడికి చేరుకొని వారికి నచ్చజెప్పి బయటకు పంపారు. ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి రికార్డులు చూసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

వినికిడి పరికరాల పంపిణీ



పరీక్షలు నిర్వహిస్తున్న విదేశీ వైద్యులు

పెనుకొండ: పట్టణంలోని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఇందులో భాగంగానే 306 మందికి వినికిడి పరీక్షలు నిర్వహించి వినికిడి పరికరాలను పంపిణీ చేశారు.

బ్రహ్మోత్సవాలకు విచ్చేయండి



దీపికకు ఆహ్వానపత్రిక అందిస్తున్న దృశ్యం

హిందూపురం: మహాశివరాత్రి సందర్భంగా లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్.దీపికను ఆలయ కమిటీ చైర్మన్ రామానందన్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేశారు.

నాడు దగా.. నేడు భరోసా

- ఇచ్చిన మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఆసరాతో అక్కచెల్లెమ్మలకు అండ
- 'పురం' నియోజకవర్గంలో 2,511 సంఘాలకు రూ.7,088.83 లక్షల లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు



హిందూపురం నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలు

హిందూపురంఅర్బన్/లేపాక్షి/చిలమత్తూరు: టీడీపీ అధినేత చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తాన్నారు. అధికారంలోకి వచ్చాక మాత్రం వారిని మోసం చేశారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగానే మహిళలకు అన్నింటా పెద్దపీట వేస్తున్నారు. ఇంటి పట్టాలు, వివిధ సంక్షేమ పథకాలు, రాజకీయ పదవులు ఇలా వారికి ప్రతి ఒక్కదాంట్లో మహిళా మణులకు అగ్రతాంబూలం ఇస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు వైఎస్సార్ ఆసరా, స్త్రీ నిధి వంటి పథకాలతో మహిళలు ఉన్నతంగా జీవిస్తున్నారు.

24,500 మందికి లబ్ధి

హిందూపురం నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రూ.7,088.83 లక్షలను మహిళల బ్యాంకుల ఖాతాల్లో జమచేశారు. 2,511 సంఘాలకు సంబంధించి 24,500 మందికి రూ.7088.83 లక్షలు లబ్ధి పొందారు.

టీడీపీ హయాంలో దగా..

డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని 2014 ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు హామీలు గుప్పించారు. గెలిచిన తర్వాత ఇచ్చిన హామీ నెరవేర్చకుండా మహిళలను మోసం చేశారు. చంద్రబాబు చేసిన మోసానికి బ్యాంకుల్లో రుణాలు కూడా రాక అక్కచెల్లెమ్మలు అనేక ఇబ్బందులు పడ్డారు. వైఎస్సార్ ప్రభుత్వం వచ్చాక పొదుపు సంఘాలకు మళ్లీ జీవం పోసింది. వారు ఆర్థికంగా నిలదొక్కుకొనేలా బాటలు వేసింది. సకాలంలో చెల్లించిన సంఘాలకు సున్నా వడ్డీ అమలు చేస్తూ భరోసా ఇస్తోంది.

మాట నిలుపుకున్న సీఎం జగన్

మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు ఇంకా రెండు నెలలు ఉండగానే ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నారు. ఆసరాకు సంబంధించి నాలుగో విడత డబ్బులను కూడా డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేయడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హిందూపురం నియోజకవర్గంలో 'ఆసరా' ఇలా..		
మండలం	సంఘాలు	మొత్తం (రూ.లక్షల్లో)
హిందూపురం	890	2,525.97
చిలమత్తూరు	961	2,920. 60
లేపాక్షి	660	1,642.26
మొత్తం	2,511	7088.83 లక్షలు

బట్టల దుకాణంతో ఉపాధి



గౌసియా మహిళా సంఘంలో నేను సభ్యురాలిని. ముఖ్యమంత్రి జగనన్న తీసుకొన్న ప్రతి నిర్ణయం మాకు మేలు చేసింది. ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో డ్వాక్రా రుణమాఫీ చేశారు. మా గ్రూప్‌కు రూ.5 లక్షల రుణమాఫీ రాగా విడతల వారీ రుణమాఫీ చేస్తున్నారు. అందులో నా వాటా రూ.50 వేలు మాఫీ అయింది. స్త్రీనిధిలో రూ.50 వేలు, బ్యాంకు ద్వారా లక్ష రుణం తీసుకొని బట్టల దుకాణం నడుపుతున్నా. మా మద్దతు జగనన్నకే.

– షాహింతాజ్, చిలమత్తూరు

జగనన్న మేలును మరువం



లేపాక్షిలోనే తోపుడు బండిపై చిల్లర వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాను. నేను గాయత్రీ మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉండటంతో రూ.39,960 వరకూ నాలుగు విడతల్లో రుణమాఫీ అయింది.. చేయూతలో 56,000 రాగా, జగనన్నతోడు కింద రూ.30,000, సున్నావడ్డీ ద్వారా రూ7,330 వచ్చింది. బ్యాంకు ద్వారా సైతం కొంత రుణం తీసుకొని ప్రశాంతంగా జీవిస్తున్నాను. జగనన్న మేలును ఎన్నటికీ మరువము.

– అలివేలమ్మ, లేపాక్షి

నేడు మంత్రి పర్యటన

పెనుకొండ రూరల్: మండలంలోని దుద్దేబండ, వెంకటగిరిపాళ్యం, గుట్టూరు, అమ్మవారిపల్లి, గోనిపేట గ్రామాల్లో గురువారం మంత్రి ఉషశ్రీచరణ్ ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నాగరాజు కుటుంబానికి అండగా ఉంటాం



నాగరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు దీపిక, శాంతమ్మ

హిందూపురం: పట్టణంలోని 34వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మణి భర్త వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నాగరాజు మృతి చెందడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ అన్నారు. కౌన్సిలర్ మణి ఇంటికి వెళ్లి నాగరాజు భౌతిక కాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగరాజు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారన్నారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారి వెంట కార్యక్రమంలో కౌన్సిలర్లు షాజియ, రహమత్ బీ , పార్వతీ, శివ, మల్లికార్జున, రోషన్ అలీ, నాయకులు నాగరాజు, భాను, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి జగనన్న



మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్



సమావేశానికి హాజరైన అంగన్వాడీ కార్యకర్తలు

- మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ చరణ్ అన్నారు. సోమందేపల్లిలోని వెంకటేశ్వర కల్యాణ మంటపంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. స్త్రీ నిధి రుణాలు, సున్నా వడ్డీతో పాటు 45 ఏళ్లు నిండిన వారికి వైఎస్సార్ చేయూత కింద రూ.18,750 ఆర్థిక సాయం ప్రతి ఏడాది అందిస్తున్నారని చెప్పారు. మహిళల రక్షణ కోసం దిశ లాంటి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సమ్మె సమయంలోని వేతనాలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వేతనాల పెంపు, పదోన్నతులు కల్పించినట్లు గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఏజీపీ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ గంగమ్మ, సర్పంచ్ గంగాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగభూషణం రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ శాంతకుమారి, అనురాధా, ఏసీడీపీఓ గీతబాయి, సూపర్‌వైజర్ శుభారాణి, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో ఆత్మీయ పలకరింపు

పెనుకొండ: ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు పక్కాగా అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని 11వ వార్డులో దర్జీపేట, తోటగేరి, రామ మందిరం వీధిలో కౌన్సిలర్ నాగరత్న, ఆమె భర్త రేపటి గణేష్, 14వ వార్డులోని కుమ్మరదొడ్డిలో కౌన్సిలర్ సద్దాం నేతృత్వంలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. పేదలు సంతోషంగా ఉండాలనే ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల నిధులను కచ్చితంగా లబ్ధిదారుల ఖాతాలకు చేరేలా చేస్తున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో 600కు పైగా హామీలను ఇచ్చి అమలు చేయకుండా అన్ని వర్గాల వారిని మోసం చేశారని గుర్తు చేశారు. మరోసారి మోసపూరిత హామీలతో చంద్రబాబు జనం ముందుకు వస్తున్నారని, ఆయన మాటలను ఎవరూ నమ్మొద్దన్నారు. ఆయనకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలకు పాతర వేస్తారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ బోయ సునీల్, కన్వీనర్ బోయ నరసింహ, కౌన్సిలర్లు సుధాకరరెడ్డి, తయూబ్, శేషాద్రి, రఘునాథరెడ్డి జయ శంకరరెడ్డి, రామాంజినేయులు, కొండలరాయుడు, సింగిల్‌విండో అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు



మాట్లాడుతున్న మడకశిర ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్

అమరాపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయలు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలానికి వచ్చిన ఆయన మొదటి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటసుసుబ్బయ్యతో మాట్లాడారు. మండలంలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి, ఆయా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రమైన అమరాపురం ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రాథమిక పాఠశాల, మండలంలోని హేమావతి, కొర్రేవు, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

రొళ్ల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు 114, 115, 116, 117, 118తో పాటు రత్నగిరి జెడ్పీహెచ్ఎస్‌లో గుర్తించిన పోలింగ్ కేంద్రాలలను బుధవారం మడకశిర ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్ పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉన్నాయో? లేదో? చూశారు. మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పారదర్శక పాలనకు పట్టం కట్టండి



గోరంట్లలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో పాల్గొన్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మత, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయని మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్‌రెడ్డి తెలిపారు. పారదర్శక పాలనకు మరోసారి ప్రజలందరూ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. బుధవారం గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని మల్లాపల్లి సమీపంలోని జగనన్న కాలనీ, మోహన్‌రావు విల్లాస్, గోరంట్ల మూడో వార్డులో సర్పంచ్ సరోజబాయి నేతృత్వంలో చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా తదితరులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకో సవితమ్మా



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుకొండ రూరల్ (రొద్దం): గ్రామాల్లో జరుగుతున్న చిన్న, చిన్న సమస్యలను తన మనుషుల ద్వారా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ అగ్గిరాజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. రొద్దంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రొద్దం మండలంలోని కంబాలపల్లి పంచాయతీ బీదానపల్లిలో చింత చెట్టు తొలగింపు వ్యవహారంతో మంత్రి ఉషశ్రీచరణ్‌కు ఏం సంబంధమో చెప్పాలని ప్రశ్నించారు. ఉషశ్రీ చరణ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక అసత్య ప్రచారాలకు తెరలేపారన్నారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని సవితమ్మ మంత్రిని విమర్శించడం సరికాదన్నారు. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకో సవితమ్మ అని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, స్వచ్ఛంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ బీనారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు నగరూరు నారాయణరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ రామాంజినమ్మ, ఎంపీటీసీ వీరేష్ తదితరలు పాల్గొన్నారు.

తపాల సేవలపై అవగాహన



మాట్లాడుతున్న తపాలశాఖ మేనేజర్ బాలకృష్ణ

అమరాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తపాలశాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని హిందూపురం తపాలశాఖ మేనేజర్ బాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హాలుకూరు గ్రామ సచివాలయంలో సచివాలయం సిబ్బంది ప్రజలకు తపాలశాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, బీమా, డిపాజిట్లు తదితర వాటిపై అవగాహన కల్పించారు. బ్రాంచ్ పోస్టుమాస్టర్లు మదుసూదన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు 'ఆసరా'



మెగా చెక్కును అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



సమావేశంలో పాల్గొన్న మహిళా సంఘం సభ్యులు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: మహిళల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ముఖ్యంగా వైఎస్సార్ 'ఆసరా'తో పేద మహిళల జీవితాలకు కొండంత భరోసా కల్పిస్తున్నారు' అని వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని హనుమాన్ టాకీస్ ఎదురుగా ఏరియా కో ఆర్డినేటర్ నాగరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను నిర్వహించారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి నాయకులు, మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. మహిళా సాధికారిత కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని, ముఖ్యంగా 'ఆసరా' పథకంతో మహిళలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు భూతరాజు , వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని , వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, మడకశిర నియోజకవర్గ పరిశీలకుడు పోకుల అశోక్‌కుమార్, మాజీ మంత్రి నర్సేగౌడ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యంజారేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

అగళి: మండల పరిధిలోని మధుడి ఎంపీటీసీ నిర్మలమ్మ భర్త, సీనియర్ నాయకుడు సదానంద ఆరాధ్య అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప బుధవారం వారి స్వగృహం వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

అగళి: మండల పరిధిలోని హెచ్‌డీ డీ హళ్లిలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్‌డీ హళ్లి గ్రామంలోని చికపయ్య కుటుంబ సభ్యులు బీజేపీ వీడీ సమన్వయకర్త ఈరలక్కప్ప సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కండువ వేసి వారందరినీ పార్టీలోకి ఆహ్వానించారు.

గ్రేడ్–5 కార్యదర్శులకు డీడీఓ అధికారాలు

చిలమత్తూరు: మండలంలో వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు డీడీఓ అధికారాలు ఇచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్ తెలిపారు. పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు.

ఈవీఎంలపై అవగాహన

పెనుకొండ: పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు, విలేఖరులకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఏ సమాచారం కావాలన్నా ఎన్నికల డెస్క్ అందుబాటులో ఉంటుందని విలేకరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నపత్రాలు

చిలమత్తూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. బుధవారం పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్లు ఈశ్వరప్రసాద్, రవిశంకర్ దగ్గరుండి పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను భద్రపరిచారు.

మడకశిరలో ఏడు పరీక్ష కేంద్రాలు

మడకశిర: ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే టెన్త్ పరీక్షలకు పట్టణంలో 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ శ్రీనివాసభాస్కర్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, కదిరేపల్లి సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో రెండు, ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ జయంతి

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శివ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించి శివుడి ప్రాశస్త్యాన్ని బ్రహ్మకుమారీలు భక్తులకు వివరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హిందూపురం: రేషన్ బియ్యం కోసం ఎండలో వేచి ఉండి వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయిన సడ్లపల్లికి చెందిన చాకలి వెంకమ్మ మృతదేహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి బుధవారం నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేశారు.

సంక్షిప్త సమాచారం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మడకశిర: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మడకశిర ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ దివాకర్ తెలిపారు. స్థానిక ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా సమావేశం జరిగింది. సీడీపీఓ నాగమల్లేశ్వరి , మున్సిపల్ కమిషనర్ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో రేపటి నుంచి ఎగ్జిబిషన్

పుట్టపర్తి టౌన్: హిందూపురం రైల్వే కమ్యూనిటీ హాల్లో పీఎంఈజీపీ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 17 వరకూ 10 రోజుల పాటు కేవీఐసీ (ఖాదీ అండ్ విజేల్ ఇండస్ట్రీ కమిషన్) ఆర్గనైజింగ్ స్టేట్ లెవల్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. గ్రామోద్యోగ ఉత్పత్తుల అమ్మకాలు పోత్సహించడానికి ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు.